సాక్షి
యాదాద్రి భువనగిరి

సోమవారం ౹ 2 ౹ అక్టోబర్ ౹ 2023



భాగస్వాములు కావాలి
రాష్ట్రాభివృద్ధిలో బ్రాహ్మణులు భాగస్వాములు కావాలని దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కోరారు. - 8లో



ఆలోచించేవాడే కవి
సమాజం కోసం ఆలోచించేవాడే కవి అని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ కార్యదర్శి నర్సింహారెడ్డి అన్నారు. - 8లో



ఓటేస్తే కాటేస్తారు
బీజేపీ, కాంగ్రెస్‌లకు ఓటేస్తే ఆ పార్టీ నేతలు ప్రజలను కాటేస్తారని డీసీసీబీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. - 9లో

• మిర్యాలగూడలో రాశిఖన్నా



మిర్యాలగూడ పట్టణంలో ఆదివారం సీఎంఆర్ షాపింగ్‌మాల్ ప్రారంభమైంది. సినీనటి రాశి ఖన్నా హాజరై అన్ని ఫ్లోర్లలో కలియదిరిగి సందడి చేశారు.

న్యూస్‌రీల్

నేడు గాంధీ జయంతి

భువనగిరి టౌన్ : కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 11 గంటలకు జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) భాస్కర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరుకావాలని కోరారు.

పరిశుభ్రత.. ఆరోగ్యానికి రక్ష



స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్న వైద్యారోగ్య, పారిశుద్ధ్య సిబ్బంది

వలిగొండ : పరిశుభ్రత పాటించడం వల్ల ఆరోగ్యానికి రక్షణ ఉంటుందని డీఎల్పీఓ సాధన సూచించారు.స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా ఆదివారం వలిగొండలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యారోగ్య సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, తడి, పొడి చెత్తను వేరే చేసి పంచాయతీ వాహనాలకు అందజేయాలని సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోళ్ల లలిత శ్రీనివాస్,ఎంపీడీఓ గీతారెడ్డి, ఎంపీఓ కేదారీశ్వర్, డాక్టర్ జ్యోతి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, పంచాయతీ సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి అసెంబ్లీ టికెట్ బీసీలకే ఇవ్వాలి



మల్లికార్జున ఖర్గేను కలిసిన కాంగ్రెస్ నాయకుడు పచ్చిమట్ల శివరాజ్‌గౌడ్

బీబీనగర్ : కాంగ్రెస్ పార్టీ భువనగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పచ్చిమట్ల శివరాజ్‌గౌడ్ ఆదివారం ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశారు. నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. బీసీలు అత్యధికంగా ఉన్న భువనగిరి అసెంబ్లీ స్థానాన్ని బీసీలకు కేటాయించాలని కోరారు. బీసీకి కేటాయిస్తే గెలిపించుకునేందుకు బీసీలంతా ఐక్యంగా ఉన్నారని వివరించారు. కాగా భువనగిరి టికెట్ ఎవరికి ఇవ్వాలనే విషయంపై ఇంకా నిర్ణయించలేదని, స్క్రీనింగ్ కమిటీలో చర్చిస్తామని చెప్పినట్లు శివరాజ్‌గౌడ్ తెలిపారు. అనంతరం శివరాజుగౌడ్ తన బయోడేటాను ఏఐసీసీ అధ్యక్షుడికి అందజేశారు.

నేడు భువనగిరిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ర్యాలీ

భువనగిరి : గాంధీ జయంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం భువనగిరిలో బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్ల ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు కుంభం అనిల్ కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. భువనగిరిలోని ఎల్లమ్మ గుడి నుంచి ర్యాలీ ప్రారంభమై ప్రధాన రహదారి మీదుగా కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలపై ఇంటింటికి ప్రచారం చేయనున్నట్లు వెల్లడించారు. పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అభివృద్ధి పరుగులు

- నల్లగొండలో రూ.912.33 కోట్లు, సూర్యాపేటలో రూ.517 కోట్లతో అభివృద్ధి పనులు
- యువత ముంగిటకు ఐటీ కొలువులు
- నేడు ఐటీ హబ్‌లను ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- రెండు చోట్లా బహిరంగ సభలు
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి





ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్

సాక్షిప్రతినిధి నల్లగొండ : రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు సోమవారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డితో కలిసి పాల్గొంటారు. సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో రూ.1429 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ముఖ్యంగా యువతకు సాంకేతిక, ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఐటీ హబ్‌లను ప్రారంభించనున్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఆఫర్ లెటర్లు అందజేయనున్నారు. అలాగే అభ్యర్థులతోపాటు నల్లగొడ, సూర్యాపేట ఐటీ హబ్‌లలో కంపెనీలు ఏర్పాటు చేస్తున్న ఎన్నారై ప్రతినిధులతో మాట్లాడనున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ యువతకు ఐటీ కొలువులు అందుబాటులోకి రానున్నాయి. అలాగే రెండు జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభల్లో మంత్రి కేటీఆర్ ప్రసంగించనున్నారు.

ఏర్పాట్లు పూర్తి

మంత్రి కేటీఆర్ పర్యటనకు నల్లగొండలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మర్రిగూడ బైపాస్ నుంచి మొదలుకొని ప్రధాన రోడ్లకు ఇరువైపులా భారీ కటౌట్లు, తోరణాలు ఏర్పాటు చేశారు. బహిరంగ సభ జరిగే ఎన్‌జీ కాలేజీ మైదానంలో వేదికతో పాటు పార్టీ శ్రేణుల కోసం టెంట్లు, కుర్చీలు ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, కలెక్టర్ కర్ణన్ పరిశీలించారు.

సూర్యాపేట, నల్లగొండలో కేటీఆర్ పర్యటన షెడ్యూల్ ఇలా..

→ 2నఉదయం 10:30 గంటలకు మంత్రి కేటీఆర్ సూర్యాపేట పట్టణంలోని ఎస్‌వీ డిగ్రీ కళాశాలకు హెలికాప్టర్‌లో చేరుకుంటారు.

→ 10:45కు సూర్యాపేటలోని పాత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఐటీ హబ్‌ను ప్రారంభిస్తారు.

→ 11 గంటలకు రూ.118 కోట్లతో నిర్మించిన సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, పట్టణ ప్రగతిలో రూ. 4 కోట్లతో ఏర్పాటు చేసిన మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్, ఎఫ్‌ఎస్‌టీపీ ప్లాంట్ ప్రారంభిస్తారు.

→ 12 గంటలకు కొత్త బస్టాండ్ నుంచి ప్రభుత్వ జూనియర్ కాలేజీ వరకు నిర్వహించే ర్యాలీలో పాల్గొంటారు.

→ మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రభుత్వ జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు.

→ 2:30 గంటలకు సూర్యాపేట నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి నల్లగొండ అన్నెపర్తిలో ఉన్న 12 బెటాలియన్‌కు చేరుకుంటారు.

→ 3:10కి నల్లగొండలోని మర్రిగూడ బైపాస్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు.

→ 3:15కి అక్కడే సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభిస్తారు.

→ 3:30కి ఐటీ హబ్ ప్రారంభిస్తారు. ఐటీ సంస్థల ప్రతినిధులు, ఉద్యోగం పొందే అభ్యర్థులతో మాట్లాడుతారు.

→ 3:45కు పాలకేంద్రం వద్ద ఏర్పాటు చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు.

→ 3:50కు తెలంగాణ చేనేత మగ్గం పథకాన్ని, చేనేత కార్మికుల కోసం రూపొందించిన యాప్‌ను ప్రారంభిస్తారు. తేరట్‌పల్లి, గట్టుప్పల్‌కు చెందిన చేనేత కార్మికులకు చేనేత మగ్గాలను అందజేశారు.

→ 4 గంటలకు బీట్ మార్కెట్‌లో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్ సముదాయాన్ని ప్రారంభిస్తారు.

→ 4:10కి గడియారం సెంటర్‌లో కళాభారతి ఆడిటోరియం, ఉదయసముద్రం సుందరీకరణ, వార్డులలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. అమృత్ 2.0 కింద తాగునీటి సరఫరా పనులు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, ఆర్ అండ్‌బీ అతిథిగృహం, ఆర్‌అండ్‌బీ డివిజన్ కార్యాలయం , వేర్‌హౌజింగ్ కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు.

→ 4:15కు సుభాష్ చంద్రబోస్ జంక్షన్, అర్బన్ పునరావాస కేంద్రం, రైతు బజారు, బీఆర్ అంబేద్కర్ జంక్షన్ అభివృద్ధి పనులను వర్చువల్‌గా ప్రారంభిస్తారు.



సూర్యాపేటలో ప్రారంభానికి ముస్తాబైన ఐటీ హబ్



నల్లగొండ ఎన్‌జీ కాలేజీ మైదానంలో సభా వేదిక

నల్లగొండలో..

నల్లగొండ జిల్లా కేంద్రంలో రూ.912.33 కోట్ల అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో కేటీఆర్ పాల్గొననున్నారు. వీటిలో ముఖ్యంగా ఐటీ హబ్‌తోపాటు రోడ్ల వెడల్పు, సెంట్రల్ లైటింగ్, భవన నిర్మాణాలు, కళాభారతి, ఉదయసముద్రం సుందరీకరణ తదితర పనులు ఉన్నాయి.

సూర్యాపేటలో అభివృద్ధి పనులు

సూర్యాపేటలో ఐటీ హబ్‌తో పాటు రూ.517 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేయనున్నారు. ముఖ్యంగా సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లు, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్, రూ.316 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, విలీన గ్రామాలకు తాగునీటి సరఫరా, సీసీ రోడ్లు, డ్రెయినేజీల పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం పట్టణానికి చెందిన 804 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూం ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తారు. కేటీఆర్ రాక సందర్భంగా సూర్యాపేట పట్టణం గులాబీమయంగా మారింది. ఏర్పాట్లను మంత్రి జగదీష్‌రెడ్డి దగ్గరుండి పర్యవేక్షించారు.



సూర్యాపేటలో సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి, ఎంపీ బడుగుల, ఎమ్మెల్యే కిశోర్



నల్లగొండ ఐటీ హబ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, కలెక్టర్ కర్ణన్

పథకాల అమలులో నంబర్ వన్

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత



గృహలక్ష్మి లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తున్న గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

తుర్కపల్లి : సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉందని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. అదివారం తుర్కపల్లి మండల కేంద్రంలో గృహలక్ష్మి లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసి మాట్లాడారు. గృహలక్ష్మి లబ్ధిదారులకు అర్హులందరికీ విడతల వారీగా ఆర్థిక సాయం అందుతుందని, ఆందోళన చెందవద్దన్నారు. వ్యవసాయానికి 24 గంటలు ఉచిత కరెంట్ ఇస్తుంటే కాంగ్రెస్ నాయకులు మూడు గంటలు ఇస్తే చాలనడం రైతులకు వారికి ఉన్న చిత్తశుద్ధిని తేటతెల్లం చేస్తుందన్నారు. మూడు గంటల కరెంట్ ఇచ్చే ప్రభుత్వం కావాలా.. 24 గంటలు ఇచ్చే సర్కార్ కావాలా ఆలోచించుకోవాలన్నారు. రుణమాఫీ, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతుబంధు, పెన్షన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలు దేశంలో మరే రాష్ట్రంలో లేవన్నారు. పథకాలు నిర్విరామంగా అమలు జరగాలంటే బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భూక్య సుశీల రవీందర్‌నాయక్, జెడ్పీవైస్ చైర్మన్ బీకునాయక్, ఎంపీటీసీలు పలుగుల నవీన్, గిద్దె కరుణాకర్, కోమటిరెడ్డి సంతోషా, సర్పంచ్‌లు కల్లూరి ప్రభాకర్‌రెడ్డి, మల్లప్ప, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశం, వాణిపరమేష్ కోఆప్షన్ సభ్యుడు రహెమత్ షరీఫ్, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పిన్నపురెడ్డి నరేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వెంకటేశం, మోతీరాంనాయక్, తహసీల్దార్ దేశ్యానాయక్, ఎంపీఓ వెంకటేశ్వర్లు, హరినాయక్, బద్దూనాయక్, కరుణాకర్‌రెడ్డి, రాజయ్య, శ్రీనివాస్ నాయక్, లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.

పడమటిసోమారంలో ఎమ్మెల్యే అడ్డగింత

- బీఆర్‌ఎస్ కార్యకర్తలకే దళితబంధు ఇస్తున్నారంటూ దళితుల ఆందోళన
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయకుండానే వెనుదిరిగిన ఎమ్మెల్యే



గ్రామం నుంచి వెళ్లిపోతున్న ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

బీబీనగర్ : మండలంలోని పడమటిసోమారంలో ఆదివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడానికి వెళ్లిన ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డిని గ్రామానికి చెందిన దళితులు అడ్డుకున్నారు. లింగబస్వేశ్వరస్వామి ఆలయ సమీపంలోని భూమిని గతంలో దళితులకు కేటాయించగా శ్మశానవాటికకు వాడుకుంటున్నామని తెలిపారు. అందులో కొంతభూమి ఆలయానికి దగ్గరగా ఉండడంతో సమాధులు నిర్మించకుండా వదిలేశామని, ఇప్పుడు అక్కడ బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మించేందుకు శంకుస్థాపన చేయడం సరికాదని దళితులు ఎమ్మెల్యేతో వాగ్వాదానికి దిగారు. అంతేకాకుండా దళితబంధు యూనిట్‌లను బీఆర్‌ఎస్ కార్యకర్తలకు మాత్రమే ఇస్తున్నారని ఆందోళనకు దిగారు, దీంతో కార్యక్రమం రసాభాసగా మారడంతో ఎమ్మెల్యే శంకుస్థాపన చేయకుండానే గ్రామం నుంచి వెనుదిరిగారు. కాగా మండల స్థాయిలో ఉన్న బీఆర్‌ఎస్‌కు చెందిన కొందరు నాయకులు తమ రాజకీయ ఉనికి కోసం గ్రామంలో గ్రూప్ రాజకీయాలు చేస్తూ గొడవలు సృష్టిస్తున్నారంటూ సర్పంచ్ ఆరోపించారు.

ప్రతి పల్లెనూ ఆదర్శంగా తీర్చిదిద్దుతా

బీబీనగర్ : మండలంలోని 14 గ్రామాల్లో ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఆదివారం అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ప్రతి గ్రామానికి రాజకీయాలకు అతీతంగా నిధులు కేటాయిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి పల్లెనూ ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుధాకర్‌గౌడ్, జెడ్పీటీసీ ప్రణీతాపింగళ్‌రెడ్డి, రైతు సమితి మండల కోఆర్డినేటర్ జైపాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వస్తాం

- కాంగ్రెస్ నాయకుడు అనిల్‌కుమార్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న అనిల్‌కుమార్‌రెడ్డి

వలిగొండ : కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీంలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావడం ఖాయమని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు అనిల్‌కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. వలిగొండలోని తన నివాసంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రైతు రుణమాఫీ రైతుబంధు, ధాన్యానికి మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్, రూ.500కే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకం కింద రూ.5లక్షల ఆర్థిక సాయం, ప్రతి ఇంటికి 200 యూనిట్‌ల ఉచిత విద్యుత్, మహిళలకు ప్రతి నెలా రూ.2,500 చొప్పున పథకాలు అందజేస్తామన్నారు. వీటితో పాటు ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, వృద్ధులకు చేయూత, నిరుపేదలకు ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం, రాజీవ్ ఆరోగ్య శ్రీ బీమా కింద రూ.10లక్షల చొప్పున అందజేయనున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్ ప్రకటించిన హామీలను ఇంటింటికీ తీసుకెళ్తున్నట్లు తెలిపారు. కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి పార్టీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నూతి రమేష్, పాశం సత్తిరెడ్డి, బోళ్ల శ్రీనివాస్, కంకల కిష్టయ్య, లిప్ మల్లేశం, బెలిద నాగేశ్వర్, గూడూరు వెంకట్‌రెడ్డి, బద్దం సంజీవరెడ్డి, గరిసె రవి, మామిడి సత్తి రెడ్డి, శంకర్, సుధాకర్, కాసుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

‘ముస్లింలు బీఆర్‌ఎస్‌ను నమ్మే స్థితిలో లేరు’

భువనగిరిటౌన్ : బీఆర్‌ఎస్‌ను ముస్లింలు నమ్మే పరిస్థితిలో లేరని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా విభాగం చైర్మన్ షేక్ మజహార్ పాషా (బబ్లూ) అన్నారు. ఆదివారం భువనగిరిలో జరిగిన జిల్లా కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనార్టీల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత రెండు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నాయకత్వం ముస్లింలను నమ్మించి మోసం చేసిందని గుర్తు చేశారు. భువనగిరిలో ముస్లింల శ్మశానవాటిక కోసం రెండు ఎకరాల స్థలం కేటాయించాలని, షాదీఖానా నిర్మించాలని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డిని కోరారు. అలాగే యువజన విభాగం మైనార్టీ సెల్ నాయకులు సమావేశంలో అవైస్‌చిస్తీ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమాల్లో మహ్మద్ నజీర్, రఫీ యొద్దీన్‌గౌరీ, బాబా, మన్సూర్, సయ్యద్ రాషేద్, మజహార్, షరీఫ్, సలా వుద్దీన్, అబేద్‌అలీ, ఇసాక్, అఫ్రోజ్ పాల్గొన్నారు.

నారసింహుడికి నిత్యారాధనలు



శ్రీస్వామివారి దర్శనానికి ప్రధానాలయ ముఖమండపంలో బారులుదీరిన భక్తులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన అర్చకులు శ్రీస్వామివారికి సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం నిజాభిషేకం, అర్చన గావించారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో సువర్ణ అష్టోత్తర పూజలు చేశారు. సాయంత్రం ఆలయంలో జోడు సేవలను ఊరేగించారు. రాత్రి శ్రీస్వామి, అమ్మవార్లకు శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పదోన్నతుల పరేషాన్!

- టెట్ పాసై ఉండాలని హైకోర్టు ఆదేశం
- జిల్లాలో 300 మంది ఉత్తీర్ణులు
- దరఖాస్తుదారులు 2,260 మంది
- న్యాయస్థానం తీర్పుతో ఉపాధ్యాయుల్లో ఆందోళన



భువనగిరి : పదోన్నతులపై ఉపాధ్యాయుల్లో ఆందోళన నెలకొంది. టెట్ ఉత్తీర్ణులైన వారు తమ సీనియార్టీ వివరాలను అందజేయాలని హైకోర్టు ఆదేశించడంతో పదోన్నతుల ప్రక్రియకు బ్రేక్ పడినట్లైనన్న అభిప్రాయం ఉపాధ్యాయుల్లో వ్యక్తమవుతోంది. ప్రస్తుతం జిల్లాలో 2,260 మంది ఉపాధ్యాయులు బదిలీల కోసం దరఖాస్తు చేసుకోగా అందులో టెట్ ఉత్తీర్ణులైన వారు 300 మంది మాత్రమే ఉన్నారు.

ఏం జరిగిందంటే..

టెట్ ఉత్తీర్ణతను తప్పనిసరి చేస్తూ కేంద్రం 2010లో చట్టం చేసింది. దీని ప్రకారం జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి (ఎన్‌సీటీఈ) అదే ఏడాది నిబంధనలు విడుదల చేసింది. ప్రస్తుతం జరుగుతున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల సందర్భంగా కొందరు ఉపాధ్యాయులు నిబంధనలు పాటించడం లేదంటూ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఈ నెల 27న కోర్టు టెట్ పాసై ప్రస్తుతం ఉపాధ్యాయులుగా ఉన్నవారు తమ సీనియార్టీ జాబితాను సమర్పించాలని ఆ ప్రకారమే పదోన్నతులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కాగా 2011లో మొదటి సారిగా టెట్ నిర్వహించగా 2012, 2017 సంవత్సరాల్లో నిర్వహించిన డీఎస్సీ ద్వారా సర్వీసులో చేరారు. వీరు జిల్లాలో 300 మంది వరకు ఉన్నారు.

లోకల్‌బాడీ స్కూళ్లకు సంబంధించి నిలిచిన ప్రక్రియ

మల్టీజోన్ – 2 కింద 14 జిల్లాలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లాకు సంబంధించి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల బదిలీలు, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు హెచ్‌ఎంలుగా పదోన్నతుల ప్రక్రియ పూర్తయ్యింది. అయితే రంగారెడ్డి జిల్లాలో జీఓ 317 ప్రకారం లోకల్‌బాడీకి చెందిన ఉపాధ్యాయులు పరిమితికి మించి యాదాద్రి జిల్లాకు రావడం వల్ల మిగిలిన వారికి నష్టం ఏర్పడుతుందని కోర్టును ఆశ్రయించారు. ఈ విషయంలో అక్టోబర్ 10వ తేదీన విచారణ జరగనుంది. దీంతో లోకల్‌బాడీ స్కూల్స్ (జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు) పదోన్నతులు, బదిలీలు నిలిచిపోయాయి.

కొనసాగనున్న ఎస్‌ఏల బదిలీలు

జిల్లాలో 5 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంల పదోన్నతులు పూర్తి కాగా ప్రస్తుతం ఇదే పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ల బదిలీలు జరగనున్నాయి. బదిలీల కోసం వెబ్ ఆప్షన్ పెట్టారు. కాగా జిల్లాలో బదిలీల కోసం మొత్తం 2,260 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. కాగా ఈ పాఠశాలల్లో కూడా ఎస్జీటీలు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందే క్రమంలో కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రక్రియ నిలిచిపోయే అవకాశం ఉంది. ఒక వైపు లోకల్‌బాడీ స్కూల్స్‌లో బదిలీలు నిలిచిపోగా మరోవైపు హైకోర్టు తీర్పుతో పదోన్నతుల ప్రక్రియ కూడా నిలిచిపోయింది. దీని పై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందోనని ఉపాధ్యాయులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

బదిలీలు కొనసాగుతాయి

ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదోన్నతులు పూర్తి కాగా బదిలీల కోసం వెబ్ ఆప్షన్లు పెట్టుకునే ప్రక్రియ కొనసాగుతుంది. లోకల్‌బాడీ స్కూళ్లలో ప్రధానోపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు ప్రక్రియ మల్టీజోన్–2 కింద జరుగుతున్నందున రంగారెడ్డి జిల్లాలో తలెత్తిన సమస్యతో నిలిచిపోయింది. పదోన్నతులకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందలేదు.

– నారాయణరెడ్డి, డీఈఓ

ప్రభుత్వం చొరవ తీసుకోవాలి

స్కూల్‌అసిస్టెంట్ల పదోన్నతికి టెట్ ఉత్తీర్ణత ఉన్న వారికి పదోన్నతులు ఇవ్వాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వటం విచారకరం. 2010కి ముందు సర్వీసులో చేరిన ఉపాధ్యాయులకు టెట్ ఉత్తీర్ణత మినహాయించబడింది. ఆ నియామకం ద్వారా సర్వీసులో చేరే వారికి మాత్రమే టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి అని చెప్పింది. అదే ఉద్దేశంతో సర్వీసులో ఉన్న వారు ఎవరూ టెట్ రాయలేదు. కానీ, టెట్ ఉత్తీర్ణత అయితేనే పదోన్నతి అని కోర్టు తీర్పునివ్వడంతో ఎనిమిదేళ్ల నుంచి ఎదురు చూస్తున్న వారి ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. ఈ విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

–సైదులు, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

క్లుప్తంగా

బైక్‌ను ఢీకొట్టిన లారీ.. యువకుడు దుర్మరణం


పవన్ (ఫైల్)

చివ్వెంల(సూర్యాపేట): లారీ అదుపు తప్పి బైక్‌ను ఢీకొట్టడంతో యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన చివ్వెంల మండల పరిధిలోని కుడకుడ గ్రామంలో సూర్యాపేట-దంతాలపల్లి రహదారిపై శని వారం అర్ధ రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చివ్వెంల మండల పరిధిలోని జగ నాతండాకు చెందిన ధరావతు వీర, పద్మ దంప తుల పెద్దకుమారుడు పవన్(23) బైక్‌పై శనివారం సూర్యాపేటలో ఉన్న తన చిన్నమ్మ వద్దకు వెళ్లి తిరిగి రాత్రి స్వగ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో కుడకుడ గ్రామంలో సూర్యాపేట-దంతాలపల్లి రహదారిపై దంతాల పల్లి నుంచి సూర్యాపేటకు వస్తున్న సిమెంట్ లారీ అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పవన్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఆదివారం మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విష్ణుమూర్తి తెలిపారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

చిట్యాల: మండలంలోని ఎలికట్టె గ్రామ పరిధిలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. చిట్యాల ఏఎస్‌ఐ జానారెడ్డి ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. మునుగోడు మండలం కమ్మగూడెం గ్రామానికి చెందిన గొట్టిపాటి రంజిత్‌కుమార్(24) బైక్‌పై శనివారం రాత్రి కమ్మగూడం నుంచి నార్కట్‌పల్లికి వస్తుండగా మార్గ మధ్యలో చిట్యాల మండలం ఎలికట్టె గ్రామ పరిధిలో బైక్ టైరు పగిలిపోవటంతో అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న రాతి కడీలను ఢీకొట్టి కిందపడిపోయాడు. స్థానికులు గమనించి అతడిని చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

అథ్లెటిక్స్ చాంపియన్ నల్లగొండ


చాంపియన్ జట్టుకు ట్రోఫీ ప్రదానం చేస్తున్న మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్ స్పోర్ట్స్: కరీంనగర్‌లో నిర్వహించిన 9వ రాష్ట్రస్థాయి జూనియర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో నల్లగొండ జిల్లా జట్టు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. అండర్-16 బాలబాలికల విభాగం, వ్యక్తిగత విభాగం, అండర్-14, 18, 20 విభాగాల్లో మొత్తం 101 పాయింట్లు సాధించింది. అండర్-14, 18, 20 విభాగాల్లో వ్యక్తిగత చాంపియన్లుగా రంగారెడ్డి, నాగర్‌కర్నూల్, ఖమ్మం, హన్మకొండ, ఆదిలాబాద్, కొత్తగూడెం జిల్లాలు నిలిచాయి. ఆదివారం రాత్రి ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి గంగుల కమలాకర్ హాజరై విజేతలకు ట్రోఫీలు ప్రదానం చేశారు.

మట్టపల్లిలో నిత్య కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఆదివారం శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్య హోమం, శ్రీమూలవిరాట్‌కి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం అష్టోత్తర సహస్ర నామార్చనలు నిర్వహించి నూతన పట్టువస్త్రాలతో స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం చేపట్టారు. కల్యాణతంతులో భాగంగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్క పూజ, మాంగళ్యధారణ గావించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ పూజల్లో ఆలయ కమిటీ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్ అర్చకులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి


బ్రాహ్మణ సదన్ ప్రారంభోత్సవంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి

చివ్వెంల(సూర్యాపేట): రాష్ట్ర అభివృద్ధిలో బ్రాహ్మణులు భాగస్వాములు కావాలని అటవీ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కోరారు. చివ్వెంల మండలం పరిధిలోని దురాజ్‌పల్లిలో రూ.2.50కోట్లతో నిర్మించిన విప్రహిత బ్రాహ్మణ సదన్‌ను ఆదివారం విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకుల గౌరవ వేతనాలు పెంచడం బ్రాహ్మణుల పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఉన్న ప్రేమకు నిదర్శనమన్నారు. బ్రాహ్మణుల పిల్లల విద్య కోసం రూ.20లక్షల ఆర్థిక సహాయం చేస్తున్నారని పేర్కొన్నారు. మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో నంబర్‌వన్ స్థానంలో ఉందన్నారు. బ్రాహ్మణ సదన్ నిర్మించడం దేశంలోనే గోపనపల్లి తర్వాత సూర్యాపేటలోనే అన్నారు. బ్రాహ్మణ సదనం ఆధ్యాత్మిక, ధార్మిక, వైదిక కార్యక్రమాల నిర్వహణకు మార్గదర్శిగా నిలుస్తుందన్నారు. పీఠాధిపతులు, ధర్మాచార్యులు విడిది కేంద్రంగా ఈ సదనం సేవలు అందిస్తుందన్నారు. పేద బ్రాహ్మణుల కల్యాణం కోసం ఉపయోగపడుతుందన్నారు. సదన్ నిర్మాణానికి ఎకరం స్థలం ఇచ్చిన డాక్టర్ ఎ. రామయ్య కుటుంబానికి మంత్రి కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్య, బ్రాహ్మణ పరిషత్ చైర్మన్, ప్రభుత్వ సలహాదారు కే.వీ.రమణాచారి, సభ్యులు వేణుగోపాలాచారి, సీఎం చీఫ్ పీఆర్‌ఓ జ్వాలా నర్సింహారావు, కలెక్టర్ ఎస్. వెంకట్రావు, మున్సిపల్ చైర్మన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, వార్డు కౌన్సిలర్ షేక్ భాషా, యాదాద్రి ఆలయ ప్రధాన అర్చకుడితోపాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న అర్చకులు పాల్గొన్నారు.

24గంటల విద్యుత్ అందించాలని ధర్నా


దామరచర్లలోని కేజేఆర్ కాలనీలో గల సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మిర్యాలగూడ: నీరు లేక ఎండిపోతున్న పంట పొలాలకు ప్రభుత్వం వెంటనే 24గంటల ఉచిత విద్యుత్‌ను అందించి ఆదుకోవాలని మిర్యాలగూడ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బత్తుల లక్ష్మారెడ్డి(బీఎల్‌ఆర్) అన్నారు. ఆదివారం దామరచర్ల మండలంలోని కేజేఆర్ కాలనీలో గల విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాన్ని నమ్మి రైతులు వరి పంట వేసుకోగా 24గంటల విద్యుత్ కాదు కదా కనీసం 12 గంటలు కూడా రావడం లేదన్నారు. దీంతో బోరుమోటార్ల ద్వారా పొలాలకు నీరందక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అటు సాగర్ కాల్వ ద్వారా నీరు రాక, ఇటు కరెంట్ లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పొట్ట దశలో ఉన్న పొలాలు ఎండిపోయే పరిస్థితి ఉందని అన్నారు. రైతులకు విద్యుత్ అందించలేని సీఎం కేసీఆర్, మంత్రి జగదీశ్‌రెడ్డి వెంటనే తమ పదవులకు రాజీనామా చేయాలన్నారు. 24గంటల విద్యుత్ అందించి పంట పొలాలను కాపాడకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి బెజ్జం సాయి, యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ ధనావత్ సిద్ధునాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్, నాయకులు పత్తనాయక్, పీక్యనాయక్, గుండెబోయిన మల్లయ్య, చింతల సైదులు, బెజ్జం సుధాకర్, చందునాయక్, బీకునాయక్ తదితరులు పాల్గొన్నారు.

రామడుగు వాసికి ఆలిండియా ర్యాంకు


ప్రియదర్శిని

హాలియా: ఇటీవల విడుదలైన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్-2023(ఐసీఏఆర్) పరీక్ష ఫలితాల్లో అనుముల మండలంలోని రామడుగు గ్రామానికి చెందిన ఆడెపు శివ కుమార్, రామేశ్వరీ దంపతుల మొదటి కుమార్తె ప్రియదర్శిని ఎస్సీ కేటగిరీలో ఆలిండియా 3వ ర్యాంకు, జాతీయస్థాయిలో 12వ ర్యాంకు సాధించింది. హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ యూనివర్సిటీలో బీఎస్సీ పూర్తిచేసిన ప్రియదర్శిని 2021-22లో జార్ఖండ్‌లోని రాంచీలో ఎంఎస్సీ పూర్తిచేసింది. ప్రియదర్శినిని తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయుడు యడవెల్లి రాంబాబు అభినందించారు.

లారీని ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

- బస్సు డ్రైవర్, ముగ్గురు ప్రయాణికులకు గాయాలు


ప్రమాదానికి గురైన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

కేతేపల్లి: రోడ్డు వెంట ఆగి ఉన్న లారీని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి ఢీకొట్టడంతో బస్సు డ్రైవర్‌తో పాటు ముగ్గురు ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ఘటన కేతేపల్లి మండలంలోని ఇనుపాముల శివారులో 65నంబర్ హైవేపై ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు హైదరాబాద్ నుంచి ప్రయాణికులతో ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరుకు బయల్దేరింది. మార్గమధ్యలో కేతేపల్లి మండలంలోని ఇనుపాముల శివారులో గల మల్లన్న గుట్ట సమీపంలోకి రాగానే రోడ్డు వెంట నిలిపి ఉన్న లారీని బస్సు వెనుక వైపు నుంచిఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. ప్రమాద సమయంలో బస్సులో 15 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ దుర్గప్రసాద్ తీవ్రంగా గాయపడగా.. ప్రయాణికులు టి. శేఖర్, ఎం. కిరణబాబు, కె. శ్రీనివాస్ స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న కేతేపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని డ్రైవర్‌ను 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి, స్వల్పంగా గాయపడిన ప్రయాణికులను జీఎమ్మార్ 1033 అంబులెన్స్‌లో నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బస్సు హైదరాబాద్ నుంచి బయల్దేరాల్సిన సమయం కంటే రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమయ్యిందని, ఆ సమయాన్ని కవర్ చేసే క్రమంలో డ్రైవర్ బస్సును అతివేగంగా నడపటం వల్లనే ఈ ప్రమాదం జరిగినట్లుగా ప్రయాణికులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్ పేర్కొన్నారు.

పల్లె కిశోర్‌కుమార్‌కు గాంధీ శాంతి పురస్కారం


కిశోర్‌కుమార్‌కు శాంతి పురస్కారం అందజేస్తున్న శిఖరం ఆర్ట్స్ థియేటర్స్ సభ్యులు

నల్లగొండ టౌన్: మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సూర్యాపేట ఎస్పీ కార్యాలయంలో ఏఎస్‌ఐగా పనిచేస్తున్న పల్లె కిశోర్‌కుమార్‌కు శిఖరం ఆర్ట్స్ థియేటర్స్ వారు మహాత్మాగాంధీ శాంతి పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రుద్రరాజు పద్మరాజు, శివనర్సింహస్వామి, డాక్టర్ ముద్దాలి మాధవరావు, వంశీకృష్ణ, మాగంటి ప్రసాదబాబు, జి. కృష్ణ, డాక్టర్ చలమల హైమావతి, విద్యారెడ్డి పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


భువనగిరి: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్న జాన్ శాంసన్ తదితరులు


యాదగిరిగుట్ట: చెత్తను తొలగిస్తున్న మున్సిపల్ కమిషనర్ పిల్లలు

- సీడీఎంఏ అదనపు సంచాలకుడు జాన్ శాంసన్

భువనగిరి: ప్రతిఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సీడీఎంఏ అదనపు సంచాలకుడు దాసరి జాన్‌శాంసన్ అన్నారు. భువనగిరి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం స్థానిక ఖిలా వద్ద నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చెత్తరహిత సమాజంగా తయారు చేసుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఇందులో భాగంగా ప్రతిఒక్కరూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అంతకుముందు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆంజనేయులు, పద్మశ్రీ అవార్డు గ్రహీత నర్ర రవికుమార్, టూరిజం జనరల్ మేనేజర్ ఉపేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బి. నాగిరెడ్డి, పర్వతారోహకురాలు అన్వితారెడ్డి, జంపాల అంజయ్య, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవలో మేము సైతం..

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ పిల్లలు భవిష్య, రుత్విక్‌చౌదరి సైతం పాల్గొన్నారు. పిల్లలిద్దరూ పట్టణ ప్రధాన రహదారులపై చెత్తాచెదారాన్ని తొలగించిన దృశ్యాలను సోషల్ మీడియాలో చూసిన పలువురు చిన్ననాటి నుంచే పిల్లలకు సామాజిక స్పృహను అలవాటు చేయడం గొప్ప విషయమంటూ ప్రశంసించారు.

తెలంగాణ మరిచిపోలేని జ్ఞాపకం.. గద్దరన్న


గద్దరన్న యాది కార్యక్రమంలో పాల్గొన్న ఆయన కుమారుడు సూర్యం, సోమన్న తదితరులు

కోదాడ: భూమి, ఆకాశం ఉన్నంత వరకు తెలంగాణ సమాజం మరిచిపోలేని జ్ఞాపకం ప్రజా యుద్ధనౌక గద్దర్ అని, ఆట పాట రూపంలో గద్దరన్న సజీవంగా ఉంటాడని పలువురు తెలంగాణ ఉద్యమకారులు అన్నారు. ఆదివారం రాత్రి కోదాడ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఓయూ జేఏసీ నాయకులు కందుల మధు, శ్రీకాంత్‌యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన గద్దరన్న యాది కార్యక్రమంలో పలువురు తెలంగాణ ఉద్యమకారులు పాల్గొని ఆయనకు ఘన నివాళి అర్పించారు. అనంతరం ప్రజాగాయకుడు ఏపూరి సోమన్న మాట్లాడుతూ.. గద్దర్ పాటతోనే తెలంగాణ సమాజంలో మార్పు వచ్చి రాష్ట్రసాధనకు ముందుకు వచ్చి పోరాటం చేశారని అన్నారు. ప్రజా గాయకురాలు వేముల పుష్ప, నల్లగొండ గద్దర్ నర్సన్న గద్దర్ పాటలను పాడి ఆయన పాటతో తెలంగాణ సమాజానికి చేసిన సేవలను గుర్తు చేశారు. అధికారంలో ఏ పార్టీ ఉన్నా తెలంగాణ ఉద్యమకారులను ఆదరించాలని, సంక్షేమ పథకాలలో, నామినేటెడ్ పదవులలో వారికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. గద్దర్ కొడుకు సూర్యం మాట్లాడుతూ.. తెలంగాణ సమాజం తన తండ్రిని గుర్తుపెట్టుకొని సంస్మరణ సభ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమ అమరుడు కాసోజు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ మాట్లాడుతూ.. గద్దరన్న పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకు వెళ్లాలని, తెలంగాణ అమరుల కుటుంబాలను, ఉద్యమకారులను ప్రభుత్వం ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో కందుల మధు, గన్నా శ్యాం, ఎస్.ఎం. శ్రీకాంత్‌యాదవ్, పోలంపల్లి బాబు, మామిడి భాస్కర్, సైదులు, సినీ నిర్మాత అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

బీబీనగర్: మండలంలోని నెమురగొములలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఎస్‌ఐ యుగేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. నెమురగొములకి చెందిన గడ్డం రఘుపతి(34) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి రఘుపతిని తమ వెంట తీసుకెళ్లారు. అనంతరం రఘుపతి మద్యం సేవించి స్పృహ కోల్పోయి అవుషాపూర్‌లోని ఓ వెంచర్‌లో పడుకున్నాడు. అటు వైపుగా అదే సమయంలో మద్యం సేవించేందుకు వెళ్లిన అన్వేష్‌రెడ్డి అనే వ్యక్తి రఘుపతిని గుర్తించి తనను గ్రామానికి రాత్రి 12గంటల తర్వాత బైక్‌పై తీసుకొచ్చి ఇంట్లో వదిలేశాడు. కాగా తెల్లవారుజామునే రఘుపతి అస్వస్థతకు గురై వాంతులు చేసుకోవడంతో, రక్తం రావడంతో ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. రఘుపతిని ఒంటిపై గాయాలు ఉండడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతుడి భార్య శ్రీలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రాక్టర్ కింద పడి పంచాయతీ కార్మికుడు మృతి

తుర్కపల్లి: ట్రాక్టర్ కింద పడి పంచాయతీ కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన తుర్కపల్లి మండలం పల్లెపహాడ్‌లో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్లెపహాడ్‌కు చెందిన దేశపాండ్య బాలనర్సింహ(38) గ్రామ పంచాయతీ నీళ్ల ట్యాంకర్ ట్రాక్టర్‌కు పార్ట్‌టైం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం గొల్లగూడెం వెళ్లి నీళ్ల ట్యాంకర్‌లో నీళ్లు నింపుకొని తిరిగి వస్తుండగా ట్రాక్టర్‌లో డీజిల్ అయిపోయింది. ట్రాక్టర్‌ను రోడ్డు మీద నిలిపి టైరు పైకి ఎక్కి డీజిల్ పంపు కొడుతుండగా ట్రాక్టర్ ముందుకు కదిలింది. దీంతో ట్రాక్టర్ టైర్లు అతడి కాళ్లు, తల పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాఘవేందర్‌గౌడ్ తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

భువనగిరి క్రైం: రైలు కిందపడి వ్యక్తి మృతిచెందాడు. భువనగిరి రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్తాన్ రాష్ట్రానికి చెందిన రామ్‌కిషోర్ సోలంకి(26) ఆదివారం భువనగిరి మండలం వంగపల్లి సమీపంలో గుర్తుతెలియని రైలు కిందపడి మృతి చెందాడు. రామ్‌కిషోర్ సోలంకి భువనగిరి మెయిన్ రోడ్డులోని బాలాజీ స్వీట్ హౌజ్‌లో పనిచేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

సమస్యల పరిష్కారంలో పీఆర్‌టీయూ ముందంజ


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేటటౌన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పీఆర్‌టీయూ టీఎస్ ముందంజలో ఉంటుందని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన పీఆర్‌టీఎస్ టీఎస్ జిల్లా సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం, సీఎం కేసీఆర్ చిత్తశుద్ధితో ఉన్నారని, ప్రతి సమస్య పరిష్కారమవుతందన్నారు. మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం హక్కుల సాధన ధ్యేయంగా పీఆర్‌టీయూ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కట్కూరి రవీందర్‌రెడ్డి, సీహెచ్.రామలింగారెడ్డి, కృపాకర్‌రెడ్డి, తంగెళ్ల జితెందర్ రెడ్డి పాల్గొన్నారు.

మోదీ పర్యటనతో ఒరిగిందేమీ లేదు

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి


మాట్లాడుతున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ: ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటన వల్ల ఒరిగిందేమీ లేదని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికీ మోదీ ప్రధానిగా ఎన్నోసార్లు తెలంగాణకు వచ్చినా ఎలాంటి లాభం జరగలేదన్నారు. విభజన హామీలను అమలు చేయాలని కేంద్రాన్ని ఎన్నిసార్లు కోరినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ నెలకొల్పాలని కోరారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పథకాలకు కేంద్రం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో నల్లగొండ జిల్లా ఊహించని విధంగా అభివృద్ధి జరిగిందని అన్నారు. సోమవారం నల్లగొండలో మంత్రి కేటీఆర్ పర్యటించి ఐటీ హబ్‌తో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు తెలిపారు. నల్లగొండలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అర్థం లేని మాటలు మాట్లాడుతున్నారని, కేసీఆర్‌కు వస్తున్న అభిమానాన్ని చూసి తట్టుకోలేక బీఆర్‌ఎస్‌పై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

గవర్నర్ వ్యాఖ్యలు సరైనవి కావు..

'మీరు రాళ్లువేయండి.. ఆ రాళ్లతో ఇల్లు కట్టుకుంటా' అంటూ గవర్నర్ తమిళిసై ఏవేవో మాట్లాడుతున్నారని, ఈ వ్యాఖ్యలు సరైనవి కావని అన్నారు. గవర్నర్‌పై ఎవరూ రాళ్లు వేయడం లేదని, ఆమె ఆవేదన ఏమిటో ఎవరికీ అర్థం కావడం లేదన్నారు.

ఎంపీ కోమటిరెడ్డిని కలిసిన వేముల వీరేశం


ఎంపీ కోమటిరెడ్డితో కలిసి అభివాదం చేస్తున్న నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్: హైదరాబాద్‌లో భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం తన అనుచరులతో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. వీరేశాన్ని వెంకట్‌రెడ్డి సాదరంగా ఆహ్వానించి పార్టీలో చేరినందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. తనకు నకిరేకల్, నల్లగొండ నియోజకవర్గాలు రెండు కళ్లలాంటివని అన్నారు. కొత్త పాత అనే తేడా లేకుండా అందరికీ ప్రాధాన్యమిస్తానన్నారు. తెలంగాణ రాష్ట్రం అంతా నకిరేకల్ వైపు చూస్తోందని అన్నారు. ఈ వారంలో ఎన్నికల షెడ్యూల్ విడుదలవుతుందని, నకిరేకల్ నుంచి వీరేశంను 50 వేల మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. వీరేశానికి మద్దతుగా నకిరేకల్ నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో ప్రచారం చేస్తానని వెల్లడించారు. మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ.. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సూచన మేరకే తాను కాంగ్రెస్‌లో చేరానన్నారు. మొదటి నుంచి పార్టీలో కష్టపడి పనిచేసిన ప్రతిఒక్కరినీ కాపాడుకుంటానని చెప్పారు. కోమటిరెడ్డి సూచన మేరకు ముందుకు సాగుతానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు గాజుల సుకన్య, వివిధ మండలాల నేతలు ఉన్నారు.

యాదాద్రి ఆలయంలో భక్తుల రద్దీ


ఆలయ పరిసరాల్లో కిటకిటలాడుతున్న భక్తులు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం సెలవు రోజు కావడంతో జంట నగరాలతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, కొండపైన, కొండ కింద బస్టాండ్లు, కల్యాణకట్ట, ప్రసాద విక్రయశాల, లక్ష్మీ పుష్కరిణి వంటి ప్రాంతాల్లో భక్తులు అధికంగా కనిపించారు. స్వామి దర్శనం కోసం ముఖ మండపంలోని క్యూలైన్‌లో భక్తులు బారులుదీరారు. స్వామి వారి ధర్మదర్శనానికి సుమారు మూడున్నర గంటలు, వీఐపీ దర్శనానికి సుమారు గంటన్నర సమయం పట్టిందని భక్తులు వెల్లడించారు. యాదాద్రీశుడిని 35వేల మందికి పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ పూజలతో స్వామి వారికి నిత్య ఆదాయం రూ.45,47,824 వచ్చినట్లు ఆలయాధికారులు తెలిపారు.

సమాజం కోసం ఆలోచించేవాడే కవి


గుమిడెల్లి శతకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏనుగు నర్సింహారెడ్డి

మోత్కూరు: సమాజం కోసం ఆలోచించేవాడే కవి అని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ కార్యదర్శి, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం మోత్కూరులోని వైజే ఫంక్షన్ హాల్‌లో కవి, ఉపాధ్యాయుడు గుమిడెల్లి వెంకన్న రచించిన గుమిడెల్లి శతకం పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గుమిడెల్లి వెంకన్న శతక పద్యాలు సామాజిక స్పృహను కలిగించేలా, ప్రతిఒక్కరు చదివి అర్థం చేసుకునేలా ఉన్నాయన్నారు. ప్రముఖ అవధాని అవుసల భానుప్రకాష్ మాట్లాడుతూ.. గుమిడెల్లి వెంకన్న తన పద్యాల్లో నీతి, లోకరీతిని, నైతిక విలువలను అద్భుత రీతిలో ఆవిష్కరించారన్నారు. ప్రముఖ సినీ గేయ రచయిత అభినయ శ్రీనివాస్ మాట్లాడుతూ.. గుమిడెల్లి వెంకన్న నిజాయితీ, సంస్కారం తన అక్షరాల్లో ప్రదర్శించారన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పోరెడ్డి రంగయ్య పుస్తక సమీక్ష చేశారు. అనంతరం తొలి ప్రతిని పుస్తక సౌజన్యమూర్తి గాదె వెంకటేశ్వర్లుకు అందజేశారు. రచయిత పుస్తకాన్ని తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం వారికి అంకితమిచ్చారు. కార్యక్రమంలో ప్రజాభారతి అధ్యక్షుడు దేవినేని అరవిందరాయుడు, రచయితల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బండారు జయశ్రీ, వలిగొండ ఆత్మీయ భారతి అధ్యక్షుడు వాకిటి రాంరెడ్డి, ఉప్పలపహాడ్ సర్పంచ్ సరిత, ఎంపీటీసీ ఎం. వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచులు రాంరెడ్డి, ప్రతాపరెడ్డి, కవయిత్రి చిందం అరుణ, ప్రజాభారతి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'మిర్యాల'లో సీఎంఆర్ షాపింగ్‌మాల్ ప్రారంభం


సీఎంఆర్ షాపింగ్‌మాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు


షాపింగ్‌మాల్‌లో చీరలను పరిశీలిస్తున్న సినీ నటి రాశి ఖన్నా

- జ్యోతి ప్రజ్వలన చేసిన ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు
- సందడి చేసిన సినీ నటి రాశి ఖన్నా

మిర్యాలగూడ: మిర్యాలగూడ పట్టణంలోని సాగర్ రోడ్డులో ఏర్పాటైన సీఎంఆర్ షాపింగ్‌మాల్‌ను ఆదివారం ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిర్యాలగూడ పట్టణానికి మరిన్ని వాణిజ్య, వ్యాపార సంస్థలు రావాలని ఆకాంక్షించారు. మిర్యాలగూడ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి రూ.25లక్షల ఆర్థికసాయం అందజేయడం అభినందించదగ్గ విషయమన్నారు. షాపింగ్‌మాల్ ఫౌండర్, చైర్మన్ మావూరి వెంకటరమణ మాట్లాడుతూ.. మిర్యాలగూడ పరిసర ప్రాంత ప్రజలకు అతి తక్కువ ధరకే వస్త్రాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఎండీ మావూరి మోహన్ బాలాజీ మాట్లాడుతూ.. తమ 24వ షోరూమ్‌ను మిర్యాలగూడలో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవంలో సినీ నటి రాశి ఖన్నా పాల్గొన్నారు. ఆమె మాల్‌లోని అన్ని ఫ్లోర్లను కలియ తిరుగుతూ సందడిచేశారు. అదేవిధంగా కమెడియన్ శివారెడ్డి తన మిమిక్రీతో అందరినీ నవ్వించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, తెలంగాణ రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, కౌన్సిలర్ చిలుకూరి రమాదేవిశ్యామ్ పాల్గొన్నారు.